బోనాలంటే చెప్పల్‌బజార్‌కు వెళ్లాల్సిందే..


మహంకాళి అమ్మవారు

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గంలోని చెప్పల్‌బజార్ బోనాల జాతరకు ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ అమ్మవారి ఆలయం ఉండదు. సికింద్రాబాద్‌లో కొలువై వున్న మహంకాళి అమ్మవారి ఆలయం నుంచి అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి చెప్పల్‌బజార్‌లో ఏర్పాటు చేసి ఇక్కడ పూజలు చేయడం ఆనవాయితీ. గత 65 ఏళ్లుగా యంగ్‌మెన్ అసోసియేషన్ వారు ఇక్కడ బోనాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 20న జరిగే బోనాల ఉత్సవాలకు 10రోజుల ముందు నుంచే నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారిని కూర్చొబెట్టడానికి ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి అందంగా తీర్చిదిద్దారు. లింగంపల్లి చౌరస్తా నుంచి చెప్పల్‌బజార్‌లోని అమ్మవారి మండపం వరకు విద్యుద్దీపాల స్వాగత తోరణాలు, వేదికలను ఏర్పాటు చేశారు. 20న ఆదివారం సాయంత్రం ఫలహారం బండి ఊరేగింపు ఉంటుందన్నారు. 21న పోతరాజుల ఊరేగింపు, భారీ సంఖ్యలో జానపద కళాకారుల ఊరేగింపు ఉంటుందన్నారు. జానపద కళాకారులు బృందాలు వీడిపోయి ఊరేగింపులో సందడి చేస్తారు. ఇది చూడటానికి నగర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. అందుకే హైదరాబాద్ నగరంలో బోనాలంటే చెప్పల్‌బజార్‌కు వెళ్లాల్సిందేనని అందరూ అంటారు.

ఆర్‌బీవీఆర్‌ఆర్ మహిళ కళాశాలకు స్వయం ప్రతిపత్తి

కాచిగూడ: యూజీసీ గైడ్‌లైన్స్‌ను ఖచ్చితంగా అమలు చేస్తున్నందులకు ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న నారాయణగూడ లోని రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాలకు 2025-2026 విద్యా సంవత్సరం నుంచి 2034-2035 విద్యా సంవత్సరం వరకు స్వయం ప్రతిపత్తి హోదాను మరో 10 సంవత్సరాల వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసిందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. డాక్టర్ జె.అచ్యుతాదేవి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే స్వయం ప్రతిపత్తి 10సంవత్సరాలు పొందిన మొదటి కళాశాల ఆర్‌బీవీఆర్‌ఆర్ మహిళా కళాశాల అని ఆమె పేర్కొన్నారు. ఆర్‌బీవీఆర్‌ఆర్ మహిళా కళాశాల 1989లో స్వయం ప్రతిపత్తి కళాశాలగా హోదాను పొందిందని ఆమె తెలిపారు.

ముషీరాబాద్ మహంకాళికి బోనాలు సమర్పించిన వైద్యులు



ముషీరాబాద్: ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య సిబ్బంది ఆస్పత్రి నుంచి బోనాలను తీసుకొచ్చి ముషీరాబాద్ మహంకాళి అమ్మవారికి సమర్పించారు. ప్రతి సంవత్సరం ఆషాఢమాసంలో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్నామని వైద్య అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది విజయకుమారి, రత్నమాల, సునిత, పద్మలత, యోగా టీచర్ దీప, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సీజీఓ టవర్స్ వద్ద ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం



కవాడిగూడ: కవాడిగూడ మెయిన్ రోడ్ సీజీఓ టవర్స్ హోటల మారియట్ ప్రధాన రహదారిపై డివైడర్ లేకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడడంతో గాంధీనగర్ ట్రాఫిక్ పోలీసులు. ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం బొల్లార్డ్స్, ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయడంతో వాహనాలు సాఫీగా వెళ్లుతున్నాయి. కవాడిగూడ మెయిన్ రోడ్డు ప్రాంతాన్ని శుక్రవారం ట్రాఫిక్ అడిషనల్ ఏసీపీ డి. రాములు, సెంట్రల్ జోన్ డీసీపీ మోహన్ కుమార్, గాంధీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి, ట్రాఫిక్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పరిశీలించారు.

గంగారాజు కన్నుమూత



చిక్కడపల్లి: వివేక్‌నగర్ పీపుల్స్ పార్క్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.గంగారాజు(84) శుక్రవారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఆయన నివాసంలో కన్నుమూశారు. గంగారాజుకు భార్య, కుమార్తె ఉన్నారు. గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్, అసోసియేషన్ సభ్యులు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బన్సీలాల్‌పేటలోని శ్మశానవాటికలో అంత్యక్రియలను ఆయన మనుమరాలు నిర్వహించారు.

బోనాలకు సర్వం సిద్ధం

● బోనాలకు కనకాల కట్టమైసమ్మ ఆలయం ముస్తాబు ● దేవాలయాల పరిసరాల్లో మొదలైన పండగ శోభ


కనకాల కట్టమైసమ్మ అమ్మవారు


శ్రీ కనకాల కట్టమైసమ్మ దేవాస్థానం

కవాడిగూడ: తెలంగాణలోనే ప్రసిద్ధిగాంచిన లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శ్రీకనకాల కట్టమైసమ్మ దేవాలయం బోనాల పండగకు ముస్తాబయ్యింది. ఆలయ కమిటీతో పాటు ప్రభుత్వం బోనాలు వేడుకలకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే దేవాలయాలకు రంగులు వేసి పరిసర ప్రాంతాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఈ వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి పోలీసు విభాగం తగిన చర్యలు తీసుకుంటోంది. జీహెచ్ఎంసీ అధికారులు ఆలయాలకు వెళ్లే దారులకు మరమ్మతులు చేశారు. అదే విధంగా ఉత్సవ నిర్వాహకులు రంగురంగుల విద్యుద్దీపాలతో స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు.

ఆలయ చరిత్ర ఇది...

జంట నగరాలకు నడిబొడ్డున హుస్సేన్‌సాగర్ కట్టను ఆనుకొని కనకాల కట్టమైసమ్మ దేవాలయం విరాజిల్లుతోంది. హుస్సేన్ సాగర్ కట్టకు ఉన్నంత చరిత్ర ఆలయానికి ఉంది. హైదరాబాద్ సంస్థానాన్ని ఇబ్రహీం కుతుబ్‌షా పరిపాలించిన కాలంలో తాగు సాగునీరు అవసరాల కోసం చెరువును తవ్వించాలని తలపెట్టారు. ఈ చెరువు నిర్మాణ బాధ్యతలను ఆయన అల్లుడు హజ్రత్ హుస్సేన్ షావలికి పనులు అప్పగించారు. దాదాపు 5.7 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో హుస్సేన్ సాగర్‌ను తవ్వించారు. హుస్సేన్ సాగర్ రాళ్లతో బలమైన కట్టను కట్టించారు. హుస్సేన్ సాగర్ నిర్మాణంలో భాగస్వాములైన శ్రామికులు హుస్సేన్‌సాగర్ కట్టకు కొందరు శ్రీ మైసమ్మ అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఈ గమనించిన హుస్సే షావలి కార్మికులను ప్రశ్నించగా చెరువు కట్టిన కట్టతెగిపోకుండా ఉండాలని దిగువ ప్రజలు మునిగిపోకుండా కాపాడాలని కోరుతూ గ్రామదేవత మైసమ్మను పూజిస్తున్నామని వివరించారు. హజ్రత్ షావలి తన జేబులో ఉన్న మొత్తం కనకపుకాసులు అమ్మవారికి సమర్పించి దండం పెట్టుకుని వెళ్లారని చరిత్రకారులు చెబుతారు. నాటి నుంచి నేటి వరకు కట్టకు వెలసిన మైసమ్మను కనకాల కట్ట మైసమ్మునిగా పిలుచుకుంటున్నారు.

నేడు నింబోలిఅడ్డలో ఘటం ఎదుర్కోళ్లు

కాచిగూడ: నింబోలిఅడ్డ మహంకాళి జాతర బోనాల వేడుకల సందర్భంగా ఈనెల 19వ తేదీన శనివారం సాయంత్రం అమ్మవారం ఘటం ఎదుర్కోళ్ల కార్యక్రమం జరుగుతుందని ఆలయ ధర్మకర్త రాజేందర్ పటేల్‌గౌడ్ తెలిపారు. 20వ తేదీన ఉదయం 4గంటల నుంచి అర్ధరాత్రి వరకు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పిస్తారని ఆయన పేర్కొన్నారు. 21వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు పచ్చి కుండ కార్యక్రమం, పోతరాజు, గావుపట్టుట, బలిగంప, రంగం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారిని ఊరేగింపుతో మూడు రోజుల పాటు జరిగే బోనాల ఉత్సవాలు ముగింపు ఉంటుందన్నారు.

భక్త సమాజం పోరాటం వల్లే తాత్కాలిక షెడ్ల ఏర్పాటు: టి.రవీందర్

కవాడిగూడ: బోనాల పండగను పురస్కరించుకొని కట్ట మైసమ్మ దేవాలయం వద్ద తాత్కాలిక షెడ్ల ఏర్పాటు తమ పోరాటం వల్లే జరిగిందని కట్టమైసమ్మ భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు టి.రవీందర్ తెలిపారు. శుక్రవారం దేవాలయం సమీపంలో ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక షెడ్ల పనులను ఆయనతో పాటు భక్త సమాజం ప్రతినిధులు, బీజేపీ నాయకులు పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం శాశ్వత షెడ్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు డిమాండ్ చేశారు. బోనాల పండుగ తర్వాత శాశ్వత షెడ్లు ఏర్పాటు చేసే విధంగా భక్త సమాజం ఆధ్వర్యంలో తమ వంతు పోరాటం చేస్తామని ఆయన పేర్కొన్నారు.


తాత్కాలిక షెడ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న భక్త సమాజం ప్రతినిధులు

అన్ని ఏర్పాట్లు చేశాం...



ఆషాఢమాసా బోనాలను పురస్కరించుకొని ఆలయంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఆలయం వద్ద బారికేడ్లను ఏర్పాటు చేశాం. ఆలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో భక్తుల సౌకర్యార్థం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో తాత్కాలిక షెడ్లను నిర్మించాం.

– గౌతమ్‌కుమార్ పటేల్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్


అచ్చయ్యనగర్‌లోని పోచమ్మ దేవాలయం


ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్‌లోని పోచమ్మ ఆలయం

ఆధ్యాత్మిక శోభ.. చారిత్రక వైభవం

బోనాలకు ముస్తాబు అవుతున్న అమ్మవారి ఆలయాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ముషీరాబాద్ నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాలు బోనాల పండగకు ముస్తాబయ్యాయి. ఈనెల 20న బోనాలు, 21న రంగం, భవిష్యవాణి, ఫలహారం బండ్ల ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహిచనున్నారు. అమ్మవారి గుడికి రంగులు వేసి శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. చారిత్రక ముషీరాబాద్ మహంకాళి, జెమినికాలనీ పోచమ్మ ఆలయం, అచ్చయ్య నగర్‌లోని ఎల్లమ్మ ఆలయం సుందరయ్య పార్కు సమీపంలోని నల్ల పోచమ్మ ఆలయాలల్లో బోనాలు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల నిర్వహణ కోసం దేవాదాయ శాఖ ముషీరాబాద్ నియోజకవర్గంలో రూ.1,07,60,500 నిధులు మంజూరు చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఈ నిధులను ఆలయ కమిటీ నిర్వహకులకు చెక్కుల రూపంలో అందజేశారు. కొన్ని ప్రాంతాల్లో అమ్మవారి ఆలయాలకు ప్రత్యేకంగా స్వాగత తోరణాలు ఆకర్షణీయం ఏర్పాటు చేశారు.

భక్తులకు అసౌకర్యం కలగనివ్వం..



భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ఆలయం వద్దనే కొబ్బరి కాయలు అగర్‌బత్తీలు తదితర అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రత్యేకంగా వలంటీర్లను నియమించి భక్తులను క్యూ లైన్‌లో పంపిస్తున్నాం. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదన వితరణ చేపడుతున్నాం.

– బి.వెంకటస్వామిగౌడ్, అచ్చయ్యనగర్ ఆలయ కమిటీ సభ్యుడు

మత సామరస్యాన్ని చాటాలి..



కుల మతాలకు అతీతంగా బోనాల ఉత్సవాలను జరుపుకోవాలి. అందరూ పాల్గొని మత సామరస్యాన్ని చాటి చెప్పాలి. బోనాల ఉత్సవాలు ప్రపంచానికే తలమానికం.

– ఎస్. రమేష్‌రెడ్డి, పీస్ కమిటీ సభ్యుడు

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆదివాసీల సంపదను కొల్లగొట్టేందుకు వారిని భయభ్రాంతులకు గురి చేస్తూ కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలని విరసం సభ్యుడు పాణి డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అమరుల బంధు మిత్రుల సంఘం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పాణి మాట్లాడుతూ... దండకారణ్యంలో అమాయకులైన ఆదివాసీ ప్రజలపై నిరంతర యుద్ధం చేస్తూ భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రజల ప్రాణాలను రక్షించాల్సిన ప్రభుత్వాలే ప్రజలపైన యుద్ధం చేయడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక ప్రజలను పొట్టన పెట్టుకుంటుందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమరుల బంధు మిత్రుల సంఘం నాయకులు శాంత, లక్ష్మణరావు, బేళా బాటియా,డి. సురేష్, సాదినేని వెంకటేశ్వర్లు, అంజమ్మ, బి.అనురాధ, ఎస్ ఏ.డేవిడ్, ఎన్.వేణుగోపాల్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.


సదస్సులో మాట్లాడుతున్న విరసం సభ్యుడు పాణి

బీసీ హాస్టళ్లలో మంత్రి ఆకస్మిక తనిఖీలు

అంబర్‌పేట: బీసీ హాస్టళ్ల విద్యార్థులకు మేరుగైన వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. శుక్రవారం అంబర్‌పేట గోల్నాకలోని బీసీ, మైనార్టీ హాస్టళ్లను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. హాస్టళ్లలో ఉన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. హస్టళ్లల్లో మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేదుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మంత్రి వెంట మాజీ ఎంపీ వి.హనుమంతారావు, కాంగ్రెస్ నేతలు శంభుల శ్రీకాంత్‌గౌడ్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.


గోల్నాకలో బీసీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్

గ్రామాల పెండింగ్ బిల్లులు ఎందుకు చెల్లించరు?

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్


సర్పంచ్‌ల మహాధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కవాడిగూడ: రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన వేల కోట్ల పెండింగ్ బిల్లులను చెల్లించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గ్రామాల్లో సర్పంచులు చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ఎందుకు ప్రభుత్వం చెల్లించడం లేదని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామపంచాయితీ పెండింగ్ నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సర్పంచుల ఇందిరాపార్కు వద్ద మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన చివరి 11 నెలలకు సంబంధించిన గ్రామపంచాయితీ పెండింగ్ బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండేళ్లు పూర్తి కావస్తున్న ఉద్దేశపూర్వకంగానే చెల్లించడం లేదన్నారు. బడా కాంట్రాక్టర్లకు వేల కోట్లు చెల్లిస్తున్న ప్రభుత్వం సర్పంచుల నిధులను మాత్రం విడుదల చేయడం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ రెండు రోజుల ఆదాయం కేటాయిస్తే గ్రామపంచాయితీ పెండింగ్ నిధుల క్లియర్ అవుతాయన్నారు. సర్పంచులు అప్పులు తెచ్చి వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని అప్పుల బాధ తట్టుకోలేక కొంతమంది సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా గ్రామ సర్పంచుల పై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్‌రెడ్డి, మాట్ల మధు, ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, కార్యదర్శులు కేసబోయిన మల్లయ్య, మన్నె పద్మారెడ్డి, నెమలి సుభాష్‌గౌడ్,మెడబోయిన గణేష్‌తోపాటు, సర్పంచులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి మల్లికార్జునశర్మ

చిక్కడపల్లి: ఉప్పులూరి మల్లికార్జున శర్మ బహుముఖ ప్రజ్ఞాశాలి అని వక్తలు కొనియాడారు. జానికి మల్లికార్జున చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో శుక్రవారం రాత్రి నిరాడంబర రాజకీయవేత్త అప్పులూరి మల్లికార్జునశర్మ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రముఖ గాయని భూదేవికి ఉప్పులూరి మల్లికార్జున శర్మ స్మారక పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత పోలీస్ ఉన్నతాధికారి గోపీనాథరెడ్డి, గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనామూర్తి, ప్రముఖులు లవంగిశర్మ, బి.సాయి, కందుకూరి సత్యవతి, మల్లెల వసుంధర, ఉప్పులూరి శ్రీనివాస్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే ఆర్టీసీ అభివృద్ధి



కాచిగూడ: అధికారులు, కార్మికుల సమిష్టి కృషితోనే ఆర్టీసీ అభివృద్ధి సాధ్యమని ఆర్టీసీ చార్మినార్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ కె.బాబు నాయక్ పేర్కొన్నారు. ఆర్టీసీ కాచిగూడ డిపో మేనేజర్ డీసీహెచ్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం డిపోలో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభను ఏర్పాటు చేశారు. అత్యధిక 'ఈపీకే' తెచ్చిన కండక్టర్లకు నగదు పురస్కారం అందజేశారు. అదే విధంగా ఉత్తమ కండక్టర్లు, డ్రైవర్లకు ప్రశంస పత్రాలను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రయాణికుల ఆదరణ కోసం ఆర్టీసీ ప్రయోగాత్మకమైన చర్యలు చేపడుతోందని చెప్పారు.

బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి

ముషీరాబాద్: బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఐక్యంగా జరుపుకోవాలని సెంట్రల్ జోన్ డీసీపీ కె.శిల్పావల్లి సూచించారు. శుక్రవారం ముషీరాబాద్ మహ్మదీయ హాల్‌లో బోనాల పండుగ నిర్వహకుల సమావేశం చిక్కడపల్లి డివిజన్, సెంట్రల్ జోన్ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... బోనాల ఉత్సవాలను నిర్వాహకులు శాంతియుతంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చైన్‌స్నాచర్, పిక్‌ప్యాకెట్ దారులపై జాగ్రత్తగా ఉండలన్నారు. పోలీసులు వారిపై నిఘా ఏర్పాటు చేయడంతో పాటు ఆలయాల వద్ద బోర్డులను సైతం ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఫలాహారపు బండ్లు, బోనాల ఊరేగింపు ర్యాలీలను త్వరితగతిన ముగించుకోవాలని సూచించారు. డీజేలకు అనుమతి లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా డీజే సౌండ్ పెండితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, ముషీరాబాద్ సీఐ రాంబాబు, చిక్కడపల్లి సీఐ రాజు నాయక్, డీఐ నదీమ్‌హుస్సేన్, ఎస్సైలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సెంట్రల్ జోన్ డీసీపీ కె.శిల్పావల్లి

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

చిక్కడపల్లి: బోనాల ఉత్సవాలు శాంతియుతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ సూచించారు. శుక్రవారం డివిజన్లోని జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్, పోలీస్, విద్యుత్‌శాఖల అధికారులతో ఆమె డివిజన్‌లోని ఎస్సార్టీ నల్ల పోచమ్మ, ఉప్పలమ్మ దేవాలయం వద్ద సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ప్రధాన ఆలయాల వద్ద భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేలా బారీకేడ్లను ఏర్పాటు చేయాలని కోరారు. పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా జీహెచ్ఎంసీ అధికారులు కవర్లను అందజేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత వినయ్‌కుమార్, ఉపకమిషనర్ రామాంజులరెడ్డి, ఏఎంహెచ్ఓ డాక్టర్ ప్రవీణ, వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్, ఎస్సైలు కరీమ్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఎ.పావని, అన్ని శాఖాల అధికారులు

దంచికొట్టిన వర్షం.. రోడ్లన్నీ జలమయం!

కురిసిన వర్షానికి రోడ్లు జలమయ్యాయి. ప్రధాన రోడ్లు వర్షపునీటితో నిండిపోయాయి. శుక్రవారం భారీ వర్షం కురవడంతో అంబర్‌పేట నియోజకవర్గంలో లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. బాగ్‌అంబర్‌పేట వైభవ్‌నగర్, మల్లికార్జున్‌నగర్, ఛే నంబర్ చౌరస్తా, అంబర్‌పేట పటేల్‌నగర్, ప్రేమ్‌నగర్, అలీకేఫ్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో భారీ వర్షపునీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పునరుద్ధరించిన బతుకమ్మకుంటలోకి వరద నీరు వచ్చి చేరింది. – అంబర్‌పేట


ముసారంబాగ్ బ్రిడ్జీపై


ఇందిరాపార్కు చౌరస్తాలో


బతుకమ్మ కుంటలోకి చేరుతున్న వరదనీరు